
సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 80 | శుక్రవారం | 11.07.2025



# శాకంబరీ దేవిగా.. అమ్మవారు..

ముగిసిన శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు



# తల్లీ శరణు శరణు

- **శాకాంబరీ అలంకరణలో భద్రకాళి మాత**
- **దర్శనానికి పోటెత్తిన భక్తులు**
- **దర్శించుకున్నమంత్రి కొండా సురేఖ**

**వరంగల్, మన చౌరాస్తా :** భద్రకాళీ శరణం మమ.. శాకంబరీ శరణం మమ.. నినాదాలతో భద్రకాళి ఆలయం మారుమోగింది. వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీభద్రకాళీ దేవస్థానంలో శాకంబరీ నవరాత్ర మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. భద్రకాళి అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతినిచ్చారు. ఆలయ ఈవో



కె.శేషు భారతి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా భక్తులు శాకంబరీ అలంకరణలో ఉన్న అమ్మ వారిని భద్రకాళీ శరణం మమ నినాదాల మధ్య దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసుల సహకారంతో ఆలయ సిబ్బంది ధర్మకర్తలు అన్ని ఏర్పాట్లు చేశారు.



# అర్హులకు సామాజిక భద్రత

## కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** అర్హులైన వారందరికీ పెన్షన్లు అందాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సెర్ప్ ఆధ్వర్యంలో అన్ని మండలాల ఎంపీడీవోలకు, పంచాయతీ కార్యదర్శులకు, మున్సిపల్ కమిషనర్ కు, బిల్ కలెక్టర్లు, పోస్టల్ డిపార్ట్మెంట్ సిబ్బందికి, టెక్నికల్ స్టాఫ్, ఎన్ఎఫ్‌బీ ఎస్ సిబ్బందికి చేయూత పింఛన్ల పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై మాట్లాడుతూ నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ స్కీంలో జనగామ జిల్లాను ముందంజలో నిలబెట్టాలన్నారు. అర్హులైన పింఛన్‌దారుల వివరాలను పోర్టులో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు వితంతువులు, నేత కల్లుగీత, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళల అవసరాలు తీర్చేందుకు చేయూత పెన్షన్ల రూపంలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సెర్ప్ పెన్షన్ విభాగం డైరెక్టర్ గోపాల్ రావు పెన్షన్ల వివిధ రకాలైన అర్హత అలాగే సాంకేతిక సమస్యలు ఉండే ఇన్స్టాంట్ స్పౌజ్,



డార్మెంట్ అకౌంట్స్, శాశ్వత వలస తదితర అంశాల పైన జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు చేయవలసిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద 769 మంది అర్హులైన లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వానికి పంపగా.. అందులో 576 మందికి రూ.20,000 చొప్పున రూ.కోటీ 15 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఆర్‌డీఏ పీడీ వసంత, అదనపు డీఆర్డీఏ నూరుద్దీన్, డీపీఎం తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే పల్లా కోసం మృత్యుంజయ హోమం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పుట్టిన రోజు సంధర్బంగా మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం బాణాపురం ఆంజనేయ స్వామి దేవాలయంలో మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే త్వరగా కోలుకుని ప్రజా క్షేంత్రంలోకి రావాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ హోమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ముస్త్యాల దయాకర్, బీఆర్ఎస్ నాయకులు అనంతుల ఆంజనేయులు, ఉల్లెంగుల సందీప్, మామిడాల రాజు, తుంగ సతీష్, చల్ల శివ తదితరులు పాల్గొన్నారు.

# గురువులను ఆరాధించాలి



**జనగామ, మన చౌరాస్తా :** సనాతన వైదిక సంస్కృతిలో గురువే నిత్య ఆరాధ్యుడని, పరబ్రహ్మ స్వరూపమని మోహనకృష్ణ భార్గవ అన్నారు. గురువారం ఆషాఢమాస శుద్ధ పౌర్ణమి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహనకృష్ణ మాట్లాడుతూ మహర్షులు చూపిన బాటలో ధర్మాన్ని అనుసరించడం ద్వారా విలువలతో కూడిన జీవితాన్ని పొందుతామన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు పాశం శ్రీశైలం, బచ్చు బాలనారాయణ, పట్టణ కోశాధికారి కుందారపు బైరునాథ్, కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, సభ్యులు ఉల్లెంగుల రాజు, అంచూరి రమేష్, కందాడి యాదగిరి, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, చంద్రమౌళి, సత్యం, సంపత్ గౌడ్, వివేక్, పోచన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అభ్యాసన సామర్థ్యల్లో జిల్లా భేష్

## దేశ వ్యాప్తంగా 50 ఉత్తమ జిల్లాలో జనగామకి చోటు

జనగామ, మన చౌరాస్తా : దేశవ్యాప్తంగా గత డిసెంబర్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 3, 6, 9వ తరగతి విద్యార్థులకు ఫరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ (నేషనల్ అచీవ్మెంట్ సర్వే ఎన్ఏఎస్ 2024) లో జరగగా ఆ ఫలితాలు ఇటీవల వెల్లడయ్యాయి. తరగతులకు సంబంధించి అన్ని అంశాలలో తెలంగాణ రాష్ట్రం నుంచి జనగామ జిల్లా దేశవ్యాప్తంగా మొదటి 50 ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాలలో జనగామ జిల్లా స్థానం సంపాదించిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు . ఎన్ఏఎస్ పరీక్ష కోసం జిల్లాలో అమలుపరిచిన ప్రత్యేక కార్యాచరణ గురించి కలెక్టర్ మాటల్లోనే ఆగస్టు మాసం నుంచే ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయడం జరిగింది. ఎస్‌సీఈఆర్‌టీ, రాష్ట్ర విద్య శాఖ సహకారంతో నిర్ణయించిన కార్యక్రమాలకు తోడు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాం. జిల్లాలో 3, 6 ,9 తరగతులు బోధించే ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి రిసోర్స్ గ్రూపును ఏర్పాటు చేసుకున్నాం. ఈ రిసోర్స్ గ్రూపు.. వారి సబ్జెక్టులలో ప్రశ్నల నిధి తయారుచేసి అన్ని పాఠశాలలకు అందజేసి,ఆయా పాఠశాలలోని మూడు , ఆరు , తొమ్మిది తరగతుల విద్యార్థులచే అభ్యాసం చేయించారు. అలాగే ప్రతి నెల ఎన్ఏఎస్ ప్రిపరేషన్ పై ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి రెగ్యులర్ గా ఫాలోప్ చేయడం వల్ల మంచి ఫలితం వచ్చింది.



# విజేతలకు ప్రశంసలు

**జనగామ, మన చౌరాస్తా :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఈ సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జనగామ జిల్లా స్కూల్ విద్యార్థులకు కోసం జూన్ 4న వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇందులో 18 మంది వ్యాసరచన, 14 మంది చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జనగామ జిల్లా ఎన్‌జీసీ తరఫున జీసీడీవో గౌసియాబేగం, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి తరఫున ఈఈ ఆర్.సునీవ ప్రశంసా పత్రాలు, మెమెంటో లను అందించగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా బాలబాలికలకు వాటిని ప్రదానం చేశారు.

# బాలయ్య సార్‌కు సన్మానం




**జనగామ, మన చౌరాస్తా :** తనకు విద్య నేర్పిన గురువు కొలిపాక బాలయ్యను డాక్టర్ సుగుణాకర్‌రాజు సన్మానించారు. గురువారం గురు పౌర్ణమి సందర్భంగా ఆయన తనకు 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మాథ్స్, హిందీని బోధించిన బాలయ్యను కలిసి సత్కరించి తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



# తల్లితో సహా మాజీ కౌన్సిలర్ ఆత్మహత్య

**జనగామ, మన చౌరాస్తా :** తల్లితో సహా ఓ మాజీ కౌన్సిలర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ పట్టణంలో కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జనగామ పట్టణంలోని గిర్నిగడ్డకు చెందిన మాజీ కౌన్సి లర్, కాంగ్రెస్ సీనియర్ నేత చారబుడ్ల దయాకర్ రెడ్డి(55), తన తల్లి అహల్యదేవి (80)తో కలిసి ఉంటున్నారు. దయాకర్ రెడ్డికి మెడకు, ఆయన తల్లికి కూడా వెన్నెముకకు సంబంధించిన ఆపరేషన్లు జరిగాయి. ఇద్దరూ అనారోగ్యం బారిన పడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన వారు గురువారం ఉదయం ఇంట్లోనే పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికుల సమాచారం మేరకు





జనగామ సీఐ దామోదర్రెడ్డి, ఎస్సైలు రాజేష్, చెన్నకేశవులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. తన తల్లి, తమ్ముడు అనారోగ్య కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నారని, వారి మరణాలపై ఎటువంటి అనుమానం లేదని దయాకర్రెడ్డి సోదరుడు వాసుదేవరెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

### పలువురి నివాళి..

జనగామ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చారబుడ్ల దయాకర్ రెడ్డి, ఆయన తల్లి అహల్యరెడ్డి ఆత్మహత్యతో పలువురు నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్రెడ్డితో పలువురు కాంగ్రెస్ లీడర్లు వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- వన మహోత్సవాన్ని సక్సెస్ చేయాలి
- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** కాలుష్యాన్ని నివారించేందుకు వన మహోత్సవాన్ని విస్తృతంగా చేపట్టాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. గురువారం స్టేషన్ఘన్పూర్లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల పాఠశాల కళాశాలలో చేపట్టిన వన మహోత్సవం పాల్గొని విద్యార్థినులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం విద్యార్థులు అలవాటుగా మార్చుకోవాలన్నారు. జిల్లాలో వన మహోత్సవం కింద 30 లక్షల 50 వేలు మొక్కలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనాన్ని పెంచి కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటవలసిన ఆవశ్యకత ఉందన్నారు. వేప, గుల్ మోహర్, సీతాఫలం, అల్లనేరేడు, చింత, కానుగ తదితర మొక్కలను ఎక్కువగా నాటాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత తరగతి గదులను సందర్శించి



విద్యార్థినులతో మాట్లాడారు. ఇష్టపడి చదవాలని, క్రమ శిక్షణ అలవర్చుకొని ప్రణాళిక తో లక్ష్యం సాధించేందుకు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ బి.విక్రమ్ కుమార్, జిల్లా ఇంటర్ విద్య అధికారి జితేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీందర్, మైనార్టీ స్కూల్ ప్రిన్సిపాల్ మాధవి లత, స్కూల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో ఫోక్స్ కేసు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** మాయ మాటలు చెప్పి ఓ మైనర్ బాలికను ఓ ప్రబుద్ధుడు గర్భవతిని చేసిన ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని తీగారంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు నిందితుడిని అదుపులో తీసుకొని పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు మైనర్ బాలికతో కొన్ని నెలలుగా ప్రేమాయణం కొనసాగించారు. కల్లి బొల్లు కబుర్లతో మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. చివరకు ఆ బాలిక గర్భం దాల్చింది. గర్భవతి కావడంతో యువకుడు ఎలాగైనా తప్పించుకోవాలని పన్నాగం పన్నాడు. తన మీదికి రావద్దని గర్భవిచ్చిందంకు సంబంధించిన ఔషధాలు ఇచ్చాడు. బాలికకు తీవ్రమైన రక్తస్రావం కావడంతో జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పింది. విషయం తెలుసుకుని కంగుతిన్న తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేశారు. విషయం బయటకు సామాజిక మాధ్యమాలతో వచ్చింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యం

**తెలంగాణ అయిల్ ఫెడ్ చైర్మన్ జంగా**

**యాదాద్రి భువనగిరి, మన చౌరాస్తా :** రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని తెలంగాణ అయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఆలేరు మండలం కొలనుపాకలో గురువారం తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పోరేషన్ అధ్వర్యంలో 100 ఎకరాలల్లో మెగా ఆయిల్ పాం ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయిల్ ఫామ్ సాగు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విఫ్ బీర్ల ఐలయ్యతో పాటు తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆయిల్పామ్ సాగు కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవగహన సదస్సులు నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనతో ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ పరిధిలో ని 64,582 మంది ఆయిల్ పామ్ రైతులకు అదనపు లబ్ధి చేకూరేలా మద్దతు ధర వచ్చేల చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పంట మార్పిడి ఆవ



శ్యకత, వంట నూనెలకు ఉన్న డిమాండ్ను దృష్టిలో పెట్టుకుని ఆయిల్ పామ్ సాగుకు రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఓఎస్డీ కిరణ్ కుమార్, మార్కెటింగ్ మెనేజర్ తిరుమలేష్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ అధికారి ప్రవీణ్ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# చెరువులను నింపాలి

**బచ్చనపేట, మన చౌరాస్తా :** గోదావరి జలాలతో మండలంలోని అన్ని చెరువులను నింపి రైతులను ఆదుకోవాలని రైతు బంధు జనగామ జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఏఈకి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ అధికారంలో రైతులు రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నీళ్లు లేక పంట పొలాలు ఎండిపోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా స్పందించి అన్ని చెరువులను నింపి రైతులను ఆదుకోవాలని వారు కోరారు.



## సెయింట్ మేరీస్‌లో ఘనంగా
# నాయక పట్టాభిషేకం

జనగామ, మన చౌరాస్తా : జనగామ జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్‌లో ఉన్న సెయింట్ మేరీస్ పాఠశాలలో విద్యార్థి నాయక పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ తుమ్మ శ్రీలత రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు నాయత్వ లక్షణాలతో ఎదగాలని, నాయకులు ఎట్లుండాలి.. వారి బాధ్యతలు ఎలా ఉండాలో విద్యార్థి దశ నుంచే తెలుసుకున్నప్పుడే వారు బాధ్యత కలిగిన భావి భారత పౌరులుగా ఎదుగుతారన్నారు. విద్యాభ్యాస కాలంలోనే గాంధీజీ నాయకత్వ లక్షణాలు కలిగి దేశ సేవకు అంకిత మయ్యారని తెలిపారు. స్కూల్ కెప్టెన్ గా కట్ట అభిమన్యు, వైస్ కెప్టెన్ గా నేనావత్ రుచిత, గ్రీన్ గ్రూప్, రెడ్ గ్రూప్, బ్లూ గ్రూప్, ఎల్లో గ్రూప్ ల వారీగా రీజన్ టాం, షెయిని, అభిలాష్ , వర్షిణి, శివ ప్రసాద్, అక్షిత, ధనుష్, జ్యోతిక కెప్టెన్ వైస్ కెప్టెన్ లుగా, స్పోర్ట్స్ కెప్టెన్ గా సంజయ్, అనీషా, తబసుమ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన విద్యార్థి నాయకులచే ముఖ్య అతిథి శ్రీలత ప్రమాణ స్వీకారం చేయించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జైమోన్ థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.







విజయ్ సేతుపతి.. మూవీ తెలుగులో..

# సార్ మేడమ్

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, నేషనల్ అవార్డు విన్నర్ నటి నిత్యా మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'తలైవన్ తలైవి'. ఈ సినిమాకు పాండిరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్య జ్యోతి ఫిలిమ్స్ బ్యానర్‌పై సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూలై 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ఇప్పటికే తమిళంలో టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాను తెలుగులో సార్ మేడమ్  పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు.  ఫుడ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు- తెలుస్తుంది. ఈ టీజర్‌లో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ మధ్య ఉండే కెమిస్ట్రీని చూపించారు.  సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో యోగిబాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.







# అయ్యో.. పూజ..!

ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ పూజా హెగ్డే. దక్షిణాదిలోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఈ అమ్మడు అదరగొట్టింది. ఇండస్ట్రీలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకొనే హీరోయిన్లలో ఒకరిగా నిలిచిన ఈ ముద్దుగుమ్మ తన అందం, అభినయంతో ఎంతగానో మెప్పించింది. అరవింద సమేత వీర రాఘవ, మహర్షి, గద్దలకొండ గణేష్, హౌస్‌ఫుల్ 4, అల వైకుంఠపురంలో, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ సినిమాలతో వరుస సక్సెస్ సాధించిన పూజా హెగ్డే ఆ తర్వాత మాత్రం హిట్ కోసం ఎంతో ఎదురు చూసింది. రాధే శ్యామ్ , బీస్ట్, ఆచార్య, సర్కస్, కిసి కా భాయ్, కిసి కీ జాన్, దేవా, రెట్రో సినిమాలు వరుసగా ఫ్లాప్ అయ్యాయి. ఇటీ-వల వచ్చిన రెట్రో చిత్రంలో డీ గ్లామరైజ్డ్ పాత్ర పోషించగా, దీనిపై కూడా ఎన్నో ఆశలు పెట్టు-కుంది. కాని అది కూడా అభిమానులకు నిరాశను మిగిల్చింది. తాజాగా ఆమెకు దక్కాల్సిన ఓ క్రేజీ కోలీవుడ్ ఆఫర్ మిస్ అయినట్టు- తెలుస్తుంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, విగ్నేష్ రాజా దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో పూజా హెగ్డేను హీరోయిన్‌గా తీసుకునే యోచనలో ఉండగా, చివరికి ఆమె స్థానంలో మలయాళ బ్యూటీ- మమితా బైజును ఫైనల్ చేశారని వార్తలు వినిపిస్తున్నాయి. మమితా బైజు, 'ప్రేమలు' సినిమా ద్వారా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. తాజాగా దళపతి విజయ్, సూర్య వంటి టాప్ హీరోల ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కించుకుంటూ, దక్షిణాది చిత్ర పరిశ్రమలో దూసుకుపోతుంది. ఇప్పుడు ధనుష్ సినిమా అవకాశం దక్కడంతో ఆమె కెరీర్ దూసుకుపోయే ఛాన్స్‌లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో పూజా హెగ్డే నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో ఆమె మార్కెట్‌లో కొంత వెనుకబడినట్లు తెలుస్తోంది. అయితే ఇది తాత్కాలిక మేనని, ఆమె బౌన్స్ బ్యాక్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అభిమానులు నమ్ముతున్నారు.అ యితే ఈ ఒక్క సినిమా మిస్ అయినా, పూజా చేతిలో ప్రస్తుతం రజనీకాంత్, విజయ్, రాఘవ లారెన్స్ లాంటి స్టార్ హీరోలతో భారీ ప్రాజెక్టులు చేస్తుంది. ప్రస్తుతం షూటింగ్‌లతో బిజీగా ఉన్న పూజా, త్వరలోనే మళ్లీ ఫాంలోకి వస్తారని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




# బాహుబలి @ పదేళ్లు

## రాజాసాబ్‌లో ప్రభాస్ వింటేజ్ లుక్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన క్లాసిక్ మూవీ 'బాహుబలి' మొదటి భాగం విడుదలై పది సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా అభిమానులే కాకుండా, చిత్ర బృందమంతా పాత జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయారు. అదే సమయంలో ప్రభాస్ మరోసారి వార్తల్లోకి ఎక్కాడు. అది కూడా ఈసారి తన స్టైలిష్ లుక్ తో. ప్రస్తుతం ప్రభాస్, డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ది రాజా సాబ్' షూటింగ్ లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో మొదటి నుంచి సంబంధం ఉన్న మాస్ ప్రొడ్యూసర్ ఎస్. కె.ఎన్ తాజాగా సెట్స్ నుంచి ఓ ఫోటోను షేర్ చేయగా, అది సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఫోటోలో ప్రభాస్ కనిపించిన విధానం అభిమానుల మన్ననలు పొందుతోంది. స్టైలిష్ గా ఓ వింటేజ్ లుక్‌లో - ఓపెన్ షర్ట్, కూల్ గ్లాసెస్, లైట్ బీట్ క్రాఫ్ట్ లుక్ లో కనిపించిన ప్రభాస్ యూత్‌ఫుల్ ఎనర్జీకి ప్రతీకగా నిలిచాడు. చాలాకాలం తర్వాత ప్రభాస్‌ను ఇలాంటి మాస్ క్లాస్ లుక్‌లో చూసిన అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు. ఇదే సందర్భంగా ఎస్‌కెఎస్ చేసిన వ్యాఖ్యలు కూడా ఫ్యాన్స్‌ను ఉత్సాహపరిచాయి. 'ఇది కేవలం ఓ బర్త్‌డే మూమెంట్ మాత్రమే కాదు, రాబోయే విజయం కోసం మొదటి సూచన కూడా..! ప్రస్తుతం జరుగుతున్న షూటింగ్ సన్నివేశాలు మెస్మరైజ్ చేస్తాయనడం గ్యారంటీ-' అంటూ తెలిపాడు. బాహుబలి పదేళ్లు పూర్తి చేసుకున్న స్పెషల్ రోజున ఇలా ప్రభాస్ నుంచి వచ్చిన తాజా లుక్ అభిమానులకు డబుల్ ట్రీట్ ఇచ్చిందని చెప్పొచ్చు.